నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 12 ఏప్రిల్ 2025 | KHAMMAM

భద్రాచలం సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఈ నెల 27..

మనకు పండుగ రోజు

- ఆ రోజున గ్రామగ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలి
- బీఆర్ఎస్ 'భద్రాచలం' సమావేశంలో ఎంపీ వద్దిరాజు
- భద్రాద్రి జిల్లా నుంచి వరంగల్‌కు దండుకడతాం: రేగా

కొత్తగూడెంలో సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వద్దిరాజు, వనమా, దిండిగాల

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం, ఏప్రిల్ 11: ఈ నెల 27వ తేదీ మనకు పండుగ రోజని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఆ రోజున గ్రామగ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం భద్రాద్రి జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన.. తొలుత భద్రాచలంలో నిర్వహించిన బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గస్థాయి సమావేశానికి హాజరయ్యారు. తరువాత కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. రేపోమాపో భద్రాచలంలో మళ్లీ ఉప ఎన్నికలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ఆ ఉప ఎన్నికలో కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి గెలవడం ఖాయమని తేల్చిచెప్పారు. పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దండుకడతాం: రేగా

అనంతరం బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భద్రాచలం నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులమంతా దండుకడతామని స్పష్టం చేశారు. వరంగల్ సభ దిగ్విజయానికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, రాంబాబు, నర్సింహమూర్తి, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, కృష్ణారెడ్డి, కణితి రాముడు, బోదెబోయిన బుచ్చయ్య, రేసు లక్ష్మి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభ దద్దరిల్లాలి: వద్దిరాజు

గులాబీ దండుతో రజతోత్సవ సభ దద్దరిల్లాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం వంటివి కేసీఆర్‌తోనే సాధ్యమని ఇప్పుడు నిరూపితమవుతోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాఘవేంద్రరావు, కాపు సీతాలక్ష్మి, సోనా, శాంతి, కొట్టి వెంకటేశ్వర్లు, ముంతపురి రాజుగౌడ్, అన్వర్ పాషా, బత్తుల వీరయ్య, అంబుల వేణు, ప్రసాద్, పిల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో రజతోత్సవం

కల్లూరు సన్నాహక సమావేశంలో ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరులో రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వద్దిరాజు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, ఏప్రిల్ 11: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా జరుపుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. కల్లూరులో శుక్రవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కల్లూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కనీవినీ ఎరుగని రీతిలో జరుగనున్నదని పేర్కొన్నారు. అనంతరం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా ఈ నెల 27న ప్రతీ గ్రామంలో ఉదయం పార్టీ జెండాలు ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు శ్రేణులు ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని కోరారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్.కిరణ్‌కుమార్, పెడగంటి రామకృష్ణ, షేక్ కమ్లీ, మేకల కృష్ణ, రవూఫ్, నర్వనేని అంజయ్య, దేవరపల్లి భాస్కర్‌రావు, ఉబ్బన వెంకటరత్నం, మాజీ సర్పంచ్‌లు నందిగాం ప్రసాద్, వెంకట రెడ్డి, పుల్లారెడ్డి, సామేలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే కావాలంటున్నారు..

ముదిగొండ సమావేశంలో జడ్పీ, సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల, కొండబాల

ముదిగొండలో వరంగల్ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ చైర్మన్లు లింగాల, కొండబాల

ముదిగొండ, ఏప్రిల్ 11: రైతులు మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారని, ఖమ్మం జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. ముదిగొండలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని విధాలా ఇబ్బందిపడుతున్న ప్రజలకు, రైతులకు పార్టీ తరపున అండగా నిలివాలని, వారి పక్షాన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 27న రజతోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు లక్ష్మారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, మందరపు ఎర్ర వెంకన్న, సామినేని హరిప్రసాద్, సత్యనారాయణరెడ్డి, పోట్ల ప్రసాద్, పచ్చ సీతారామయ్య, భద్రయ్య, ఖాజా, భిక్షం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో బీఆర్ఎస్ పాత్ర కీలకం

కారేపల్లి సన్నాహక సమావేశంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

కారేపల్లిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

కారేపల్లి, ఏప్రిల్ 11: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందని, పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్ గుర్తుచేశారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ జయప్రదం కోసం కారేపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల పార్టీ ఆవిర్భావ వేడుకలను వాడవాడలా పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభకు వెళ్లే ముందు 27న ఉదయం అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని కోరారు. అనంతరం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు వాంకుడోతు జగన్, వీరేందర్, రమేశ్, గౌసుద్దీన్, జడల వెంకటేశ్వర్లు, వసంత, సోమందుల నాగరాజు, ఇస్లావత్ బన్సీలాల్, పేర్ని వెంకటేశ్వర్లు, దొంకెన రవి మణికొండ నాగేశ్వరరావు, జాటోత్ వీరియానాయక్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక నిఘా

సెక్టార్ ఆఫీసర్లకు బాధ్యతలు: ఖమ్మం సీపీ

వీడియో కన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీపీ దత్

ఖమ్మం, ఏప్రిల్ 11: ఆన్‌లైన్ బెట్టింగ్, మోసాలు, లోన్‌యాప్ కార్యకలాపాలపై నిఘా పెంచాలని సెక్టార్ ఆఫీసర్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. శుక్రవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హనుమాన్ జయంతి ర్యాలీ ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. ఏడీసీపీ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: చినబండిరేవులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కొనుగోలు చేస్తారా!

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెట్టడం షరా మామూలైపోయింది. దీంతో రైతులకు ప్రతియేటా ధాన్యం అమ్మకాల వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. గత వానకాలంలో కూడా కొనుగోలు కేంద్రాల వద్ద నానారకాల నిబంధనలు పెట్టడం వల్ల రైతులు బయట విక్రయాలకు మొగ్గు చూపారు. ఈసారైనా అధికారులు చిత్తశుద్ధితో కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు సక్రమంగా కొంటారా.. కొర్రీలు పెడతారా.. అనే సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. తేమ పేరుతో రైతుల్ని కేంద్రాల వద్ద క్యూలో ఉంచడం వల్ల రోజులకొద్దీ అక్కడ ఉండలేక ముందుగానే షాపుకార్లకు రేటు ఎట్లా ఉన్నా అమ్మకాలు చేసుకుంటున్నారు. ఏదేమైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై రైతులకు పూర్తిగా నమ్మకంపోయింది. ఇదే అదనుగా దళారులు యాసంగి ధాన్యంపై కన్నేసి రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. మరీ అధికారులు రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తారో లేదో వేచిచూడాలి.
–భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ)

కొర్రీలు పెడతారా?

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏటా తిప్పలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి లోపించిన చిత్తశుద్ధి
- యాసంగి ధాన్యంపై కన్నేసిన దళారులు
- 'భద్రాద్రి'లో 144 కేంద్రాల ఏర్పాటు లక్ష్యం
- ఇప్పటికి 124 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఒకవైపు వానలు లేక.. మరోవైపు పంట దిగుబడి సరిగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో అకాల వర్షం వచ్చి యాసంగి పంటపై పిడుగు పడినట్లయింది. దీంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టుకునే పనిలో పడ్డారు. అసలే గిట్టుబాటు ధరలు అంతంత మాత్రంగా ఏ గ్రేడ్ రకం రూ.2,320, మామూలు రకం రూ.2,300 ధరను నిర్ణయించారు. మార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం మాత్రం ధాన్యం రేట్లు పెంచడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పేరుకే సన్నబియ్యానికి బోనస్ అంటున్నారు.. కానీ.. సమయానికి బోనస్ ఇవ్వకపోవడంతో వానకాలం పంటల విక్రయాల సమయంలో రైతులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు దళారుల చేతుల్లో రైతులు మోసపోవాల్సి వస్తున్నది. రేటు ఎక్కువ ఇస్తానని చెప్పి కాంటాల్లో తేడా చేసి రైతుల్ని మోసం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల వద్దనే సమస్యలు

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నారు. తేమశాతం చూసి ఇంకా వడ్లు ఆరాలని కేంద్రాల వద్దనే ఉంచడం వల్ల రోజులకొద్దీ అక్కడే వేచి ఉండాల్సి వస్తున్నది. మరోవైపు గన్నీ బ్యాగులు సకాలంలో రాక కొంత ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు ఖాతా నెంబర్లు ఇచ్చినా సకాలంలో ఖాతాలో సొమ్ములు పడకపోవడం వల్ల డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తోంది.

భద్రాద్రి జిల్లాలో 144 కేంద్రాలు

భద్రాద్రి జిల్లాలో యాసంగి పంటను అంచనా వేసిన అధికారులు 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లెక్కలు వేశారు. ఇందుకోసం 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికే 124 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అకాల వర్షం కురియడంతో హార్వెస్టింగ్ ఆలస్యం అవుతున్నందున రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకురావడం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గన్నీ బ్యాగులు, హార్వెస్టింగ్ పరికరాలు, తేమ శాతం మిషనరీలను ఇప్పటికే మార్కెటింగ్ శాఖ నుంచి కేంద్రాలకు చేరవేశారు.

పాల్వంచ: రైతు కల్లం వద్ద వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈవో

ప్రతిసారి తేమ శాతం వద్దనే సమస్య

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చినప్పుడల్లా తేమ శాతం రాలేదని అధికారులు ఆలస్యం చేస్తున్నారు. అందుకే ఇక్కడ అమ్మాలంటే ఇబ్బందిగా ఉంది. రేటు తక్కువైనా సరే బయటనే అమ్ముతున్నాం. కొనుగోళ్ల తర్వాత కూడా వారంరోజులైనా సొమ్ములు బ్యాంకు ఖాతాలో పడవు. డబ్బుల కోసం పడిగాపులు కాయాలి. ప్రతి ఏటా కొనుగోలు కేంద్రాల వద్దనే సమస్య వస్తున్నది. పై అధికారులు తనిఖీలు చేస్తే సమస్య లేకుండా ఉంటుంది.
–పూసం వెంకటేశ్వర్లు, రైతు, బెండాలపాడు, చండ్రుగొండ

ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లకు సిద్ధం

ఇప్పటికే కొన్ని కేంద్రాలకు ధాన్యం వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 124 కేంద్రాలను ప్రారంభించాం. అన్ని కేంద్రాల్లో గన్నీబ్యాగులు సిద్ధంగా ఉంచాం. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేవు. వారంరోజుల్లో అన్ని ఏరియాల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. వర్షం వల్ల రైతులు కొంత ఇబ్బంది పడ్డమాట వాస్తవమే. ఎంత త్వరగా ఆరబెడితే అంత త్వరగా కొనుగోలు చేస్తాం.
–త్రినాథ్‌బాబు, డీఎం, పౌరసరఫరాల శాఖ

అశ్వారావుపేట టౌన్: ఈదురు గాలులకు విరిగిపడిన అరటి తోట

నష్టాల వాన..

- అకాల వర్షంతో 'అశ్వారావుపేట'లో దెబ్బతిన్న పంటలు
- మామిడి, అరటి, జీడిమామిడి, పొగాకు రైతులకు తీవ్ర నష్టం
- గాలుల ధాటికి విరిగిపడిన భారీ వృక్షాలు, కరెంటు స్తంభాలు
- విద్యుత్‌ను పునరుద్ధరించక పోవడంతో అవస్థపడిన ప్రజలు

అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 11: భారీ ఈదురుగాలులు, అకాల వర్షం అన్నదాతకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. మండలంలో గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షంతో మామిడి, అరటి, జీడిమామిడి తోటలతోపాటు వరి, మిర్చి, పొగాకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. భారీ వృక్షాలు, కొబ్బరి, అరటి తోటలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు గంటలతరబడి అంతరాయం ఏర్పడడంతో ప్రజలు రాత్రంతా తీవ్ర ఇబ్బందులుపడ్డారు. శివయ్యగారి బజారులో చిరంజీవి ఇంటి వద్ద కొబ్బరి చెట్లు విరిగిపడడంతో ప్రహరీ ధ్వంసమైంది. మద్దిరావమ్మ సెంటర్‌లోని ఆరేపల్లి లక్ష్మణరావు ఇంటిపై భారీ మామిడి చెట్లు విరిగిపడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. తూర్పు బజారులో చెట్లు విరిగిపడ్డాయి. బస్టాండ్ వెనుక ఉన్న కట్టా హనుమంతురావు, నాగేశ్వరరావులకు చెందిన అరటి తోట సుమారు రెండు ఎకరాల మేర నేలవాలింది. వినాయకపురం, మల్లాయిగూడెం, నారాయణపురం, అనంతారం, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, సున్నంబట్టి తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. దీంతో తోటలు కౌలుకు తీసుకున్న వ్యాపారులు, సాగు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్లు, పంటలు దెబ్బతిన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు, రైతులు కోరారు.

అశ్వారావుపేట టౌన్: విరిగిపడిన కొబ్బరి చెట్టు
ఇంటిపై కూలిన చెట్టు
ఈదురుగాలులకు విరిగిన మామిడి కొమ్మలు
విరిగిపడిన పామాయిల్ చెట్టు
గాలివాన బీభత్సానికి ధ్వంసమైన ఆవాసం
రాలిన మామిడి పండ్లు

రెడ్‌క్రాస్‌ను సద్వినియోగం చేసుకోండి

వ్యాధి నిర్ధారణ పరీక్షల కేంద్రం ప్రారంభంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్



వ్యాధి నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

భద్రాచలం, ఏప్రిల్ 11: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా, రక్తహీనత పుట్టుకతో సంక్రమిస్తుందని, వ్యాధి తీవ్రతను బట్టి వారికి రక్తం ఎక్కించి కాపాడాల్సి ఉంటుందన్నారు. పేదలు, గిరిజనుల సంక్షేమం కోసం ఒక్కోటి రూ.1,800 విలువ చేసే వ్యాధి నిర్ధారణ కిట్స్‌ను రూ.5 లక్షల వ్యయంతో ఐటీసీ పీఎస్‌పీడీ సారపాక వారు అందించారని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు మాట్లాడుతూ రక్తనిధి కేంద్రంలో ఉచితంగా తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఎలక్ట్రోఫర్సీస్ పద్ధతిలో నిర్వహిస్తామని, ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షకు రూ.2 వేలు ఖర్చవుతుందని, ఇందుకోసం సంస్థ ఆధ్వర్యంలో అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యులు వై.సూర్యనారాయణ, జి.రాజారెడ్డి, వి.కామేశ్వరరావు, గోళ్ల భూపతిరావు, జి.సంజీవరావు పాల్గొన్నారు.